

నేడు జిల్లాలో మంత్రి పొన్నం పర్యటన

సిరిసిల్ల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్‌తో కలిసి ఉదయం 8.30 గంటలకు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఉదయం 10 గంటలకు కేడీసీసీ బ్యాంక్ శాఖను ప్రారంభిస్తారు. సిరిసిల్లలో శ్రీ విశ్వనాథ ఆలయం ప్రహరీ ఆర్చికి భూమిపూజ చేస్తారు. 11.30 గంటలకు అపెరల్ పార్కును సందర్శిస్తారు. 2.30 గంటలకు ముస్తాబాద్‌లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వి'నాయకా'..!





- స్థానిక ఎన్నికల ముందు చవితి వేడుకలు
- ఉత్సవాల నిర్వహణకు ముందుకు వస్తున్న నేతలు
- పెరుగనున్న ప్రతిమల ధరలు
- ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసుల దృష్టి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆదిదేవుడిగా కొలిచే గణనాథుల నవరాత్రోత్సవాలకు భక్తులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం యువజన సంఘాలు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో విగ్రహాల తయారీ పూర్తికాగా విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. మరో వైపు స్థానిక సంస్థల ఎన్నికలు ముందు ఉండటంతో ఈ యేడు నవరాత్రోత్సవాలకు రాజకీయ ప్రాముఖ్యత కనిపించే అవకాశం ఉంది. యువత, ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఉత్సవాల ఏర్పాట్లతో పాటు , నిర్వహణకు ముందు కు వచ్చే అవకాశం ఉంటుంది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, 2,240 వార్డులు ఉన్నాయి. సర్పంచుల నుంచి మొదలుకుని వార్డు సభ్యు లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై కన్నేసిన వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రాజకీయ ఎదుగుదల వ్యూహరచనలో యువతను అకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. వినాయక ఉత్సవాలకు అవసరమయ్యే విగ్రహాలు, ఏర్పాట్లకు సంబంధించి ఉచితంగానే అందజేసేందుకు సిద్ధమయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా సిద్ధమవుతున్న క్రమంలో ఎన్నికలు కూడా దసరా వరకు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో యువజన సంఘాలు ఆశావహుల నుంచి ఆశిస్తున్న వినాయక విగ్రహాలు, మండ పాలు, సౌండ్ సిస్టమ్ వంటివి సమకూర్చకుంటే దూరమవుతారనే భావనతో ఆశావహులు కాదనలేక పోతున్నట్లు చర్చించుకుంటున్నారు. ఉత్సవాలకు ఖర్చు చేస్తున్న నాయకులు మాత్రం ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు మైకుల్లో తమను ప్రమోట్ చేస్తూ ప్రచారం చేయాలని ఒప్పందం చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో నిర్వాహకులకు కొంత భారం తగ్గినట్లుగానే భావిస్తున్నారు.

పోలీసుల అనుమతులు తప్పనిసరి

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులు దృష్టి సారించారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో మండ పాల నిర్వాహకులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండ పాల నిర్వాహకులు ఉత్సవాలకు అనుమతులు పొందే విధంగా నిబం ధనలు పెట్టారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు, ఏర్పాటు చేసుకో వడంతో పాటు డీజేసౌండ్‌ను నిషేధించారు. వినాయక నిమజ్జనం రోజు శోభాయాత్రలకు 12 గంటలలోపు పూర్తయ్యే విధంగా సూచనలు జారీ చేశారు. గత సంవత్సరం నిబంధనలకు విరుద్ధంగా రెండు మూడు రోజు లు నిమజ్జనం చేస్తూ ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి. పోలీసులు విగ్రహాల నిమజ్జనం, శోభాయాత్రల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నారు.

- జిల్లాలో మొదలైన సందడి

తొలిపూజను అందుకునే గణేష్ ఉత్సవాల సందడి రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదలైంది. జిల్లా కేంద్రంలో చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాలను తయారు చేసి అమ్మకాలకు ఉంచారు. మరోవైపు భారీ విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకవస్తున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనే భారీ సైజుల్లో విగ్రహాలు తయారు చేస్తున్నారు. స్థానిక కళాకారులతోపాటు రాజస్థాన్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కళాకారులను రప్పించి విగ్రహాలు తయారు చేయించారు. మరికొందరు వ్యాపారులు మహారాష్ట్ర, హైదరాబాద్, విజయవాడ, జగిత్యాల, వరంగల్ ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నారు. మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చిన విగ్రహాలు వివిధ రంగులతో విభిన్నంగా కనిపిస్తున్నాయి. సిరిసిల్లలోనే పెద్ద సైజు విగ్రహాలు రూ.15 నుంచి రూ.70 వేల వరకు ధరలు చెపుతున్నారు. హైదరాబాద్ నుంచి లక్ష రూపాయల వరకు ఉండే భారీ విగ్రహాలను సైతం ప్రతిష్ఠించడానికి యువజన సంఘాలు తీసుకవచ్చాయి. గతంలో కంటే ఈసారి ధరలు 10 నుంచి 20 శాతం వరకు అదనంగా పెరిగాయి. చిన్న విగ్రహాలు సైతం భారీ ధరలే ఉండడంతో సామాన్య ప్రజలకు ఉత్సవాలు భారంగానే మారుతున్నాయి. సెప్టెంబరు 7న ప్రారంభమయ్యే చవితి ఉత్సవాల కోసం సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు.



సిరిసిల్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమల్ల హన్మాండ్లు



రెడ్డిమల్ల హన్మాండ్లు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంకు చెందిన రెడ్డిమల్ల హన్మాండ్లు తెలంగాణ రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెడ్డిమల్ల హన్మాండ్లును జిల్లా సంఘం నాయకులు మంగళవారం సిరిసిల్లలో అభినందించారు. రంగా రెడ్డి జిల్లాలో సోమవారం తెలంగాణ రాష్ట్ర డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు అధ్యక్షతన సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. 22 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర సంఘం ప్రతినిధులు సమావేశంలో పాల్గొని పూర్తి స్థాయి రాష్ట్ర స్థాయి కార్యవర్గంను ఎన్నుకున్నారు.

కబ్జాకు గురైన ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 27: కబ్జాకు గురైన చెరువులు, కుంటల ప్రాంతాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర గంగపుత్ర సంఘ యువత అధ్యక్షుడు కాత మల్లేశం ఒక ప్రకటనలో కోరారు. హైద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా పనితీరు బాగుందని, జిల్లాలోనూ ఇదే విదంగా ఏర్పాటు చేయడం ద్వారా కుంటలను ఇతరులు ఆక్రమించుకునే అవకాశం ఉండదన్నారు. చెరువులను ఆక్రమించుకోవడం వల్ల గంగపుత్రులు ఉపాధి కోల్పోతున్నారన్నారు.

నేడు రైతు రుణమాఫీపై సీపీఐ ధర్నా

వేములవాడ, ఆగస్టు 27: రైతు రుణమాఫీ సక్రమంగా అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 28వ తేదీ బుధవారం రైతులతో ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మ్యాక్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా అశ్విన్‌చంద్ర

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయవాదుల పరస్పర సహకార పరపతి(మ్యాక్) సంఘం ప్రధాన కార్యదర్శిగా ఇరుకుల్ల అశ్విన్ చంద్రను నియమించామని అధ్యక్షులు గోవింద భాస్కర్ తెలిపారు. జాయింట్ సెక్రెటరీగా పొత్తూరి అనిల్‌కుమార్, కోశాధికారిగా గుడ్ల కిషన్‌లను నియమించామని తెలిపారు. వీరిని 12మంది డైరెక్టర్‌లు కలిసి ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక

గంభీరావుపేట, ఆగస్టు 27: గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా భూపెల్లి హనుమాన్లు, కో కన్వీనర్లుగా జక్కుల నవీను, పల్నాటి దేవరాజు, పల్నాటి రాజు, గుమ్మడి శ్రీనివాస్, పోతుల నర్సింలు, బంటు సురేష్, పిట్ల వెంకటేష్, గుమ్మడి దేవరాజ్, పల్నాడు కార్తీక్, నక్కరాజు, రామస్వామి, పిట్ల వెంకట్, తలారి రాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ జిల్లా ప్రతినిధులు దోసల చంద్రం, ఎగదండి స్వామి,బండ రమేష్, ఎడబోయిన రాజు, మల్యాల రాజవీర్ గార్ల సమక్షంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నికయింది.

వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ, ఆగస్టు 27 : వేములవాడ పట్టణ ముస్లిం కమిటీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అక్రమ్ వెల్లడించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి షాహిద్ పాషా, కోశాధికారి ముషాహీద్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ గౌరవ అధ్యక్షుడిగా లాయక్ పాషా, ఉపాధ్యక్షుడిగా మొహమ్మద్ అజీమ్, అబ్దుల్ రజాక్, షబ్బీర్ అలీ, సయ్యద్ ఉమర్, ముఖ్య సలహాదారులుగా ఎండి అమానుల్లా ఖాన్, ఏంఏ.మన్నాన్, యం.ఏ కలీం పాషా, షేక్ బాబున్, యండి.పీర్ మొహమ్మద్, ఎండి సలీం, షేఖ్ సాబిర్, షేక్ రియాజ్, ఏం ఏ రాహిల్, జాయింట్ సెక్రటరీలుగా వహీదోద్దీన్ పర్వేజ్, షేక్ అబ్దుల్ రెహమాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సయ్యద్ ఫహాద్ పాషా, అబ్దుల్ రాహిల్ (సొహెల్), మహమ్మద్ అజీమ్, కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ మజాహార్ పాష, షేక్ అలీ, మొహమ్మద్ అఫ్సర్, ఎండి షకిల్, మొహమ్మద్ సయ్యద్ పాషా, మొహమ్మద్ షహబాజ్, మహమ్మద్ ఇమ్రాన్, సయ్యద్ సలీం పాషాలను ఎన్నుకున్నామని తెలిపారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడ, ఆగస్టు 27 : ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేశ్వర్ కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం-2025లో భాగంగా మంగళవారం ఆయన వేములవాడలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కోసం ఈ నెల 20వ తేదీ నుంచి బూత్ స్థాయి అధికారులతో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సర్వేలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు తదితర సవరణలు చేపడుతామని, వచ్చే జనవరిలో తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు. ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల సభ్యులు క్షేత్రస్థాయిలో సహకరించాలని ఆర్డీవో రాజేశ్వర్ కోరారు. సమావేశంలో వేములవాడ తహసీల్దార్ ఎస్ మహేష్ కుమార్, ఎలక్షన్ నాయబ్ తహసీల్దార్ శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిత్యానందరావు, బీఆర్ఎస్ నాయకుడు పొలాస నరేందర్, టిడిపి నాయకుడు రామస్వామి గౌడ్, సీపీఐ నాయకుడు కడారి రాములు ఉన్నారు.

జిల్లాలోనూ హైడ్రా ఏర్పాటు చేయండి

- ముఖ్యమంత్రికి లేఖ రాసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 27 : చెరువులు, కుంటలను కాపాడేందుకు హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేసిన హైడ్రా తరహా వ్యవస్థను రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏర్పాటు చేయాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. హైదరాబాద్ మహానగరం పరిధిలోని చెరువులు కుంటలను ఆక్రమించుకుని నిర్మించిన భవనాలను హైడ్రా కూల్చివేస్తున్న వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని, హైడ్రా తరహాలోనే రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, నదులు, వాగుల పరివాహక ప్రాంతాలను పరిరక్షించాల్సి ఉందని ఆయన లేఖలో కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు వేములవాడ నియోజకవర్గంలోని పలు మండలాలలో అనేకచోట్ల చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని, వేములవాడ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చెన్నమనేని రమేష్ సేఫ్ గెస్ట్ హౌస్ సైతం మూలవాగును అనుకుని నిర్మించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి అనుమతులు లేకుండానే చెన్నమనేని రమేష్ నిర్మించిన ప్రహరీ సైతం వాగులోకి చొచ్చుకుపోయినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. సమాజంలోని మేధావివర్గంతో పాటు సామాన్య ప్రజలలోను హైడ్రా కార్యకలాపాల పట్ల సానుకూల స్పందన వ్యక్తం అవుతున్న కారణంగా అన్ని జిల్లాలలోనూ ఇదే తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసి ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను పరిరక్షించాలని ఆయన లేఖలో కోరారు. ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయం నిజమేనని స్పష్టం చేశారు. చెరువులు కుంటలు ఆక్రమించుకుని బడా బాబులు నిర్మించిన బంగళాలను ప్రజా ప్రభుత్వం కూలగొడుతుండడం పట్ల ప్రజాబాహుల్యంలో విశేషమైన స్పందన కనిపిస్తున్నదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వమని తెలిపారు.



సీఎంకు లేఖ రాస్తున్న ఆదిశ్రీనివాస్

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో

బోయినపల్లి, ఆగస్టు 27: మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 9,450, ములవాగు మానేరు వాగు ద్వారా 1,050 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. దిగువ ఎల్ఎండీ ప్రాజెక్టుకు ఐదు గేట్ల ద్వారా 14 వేల 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 313.97మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 18.19 టీఎంసీలు ఉన్నది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో మూడు టీఎంసీల నీరు

ఇల్లంతకుంట, ఆగస్టు 27: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మూడు టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు నుంచి 3,200 క్యూసెక్కుల నీటిని ఒక పంపుద్వారా ఎత్తిపోస్తున్నారు. ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు నీటి విడుదలను నిలుపుదల చేశారు.

రుణమాఫీ కాని రైతులు నేటి ధర్నాలో పాల్గొనాలి

తంగళ్లపల్లి, ఆగస్టు 27: రుణమాఫీ కాని రైతులందరూ ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సోమ నాగరాజులు పిలుపునిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం రాళ్లపేట గ్రామంలో మాట్లడుతూ ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కల్గిన రైతులందరికీ రుణమాఫీ పథకం అమలు కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటి వరకు 50 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. రుణ మాఫీ కోసం రైతులు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే రుణాలు మాఫీ చేయాలన్నారు. కలెక్టర్ ఎదుట నిర్వహించే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జంగం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం/ వేములవాడ, ఆగస్టు 27: శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రానున్న గణేశ్ ఉత్సవాల సందర్భంగా మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కళ్యాణలక్ష్మి గార్డెన్స్‌లో సిరిసిల్ల సబ్ డివిజన్‌లోని గణేశ్ మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో, వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వహకులతో ఎస్పీ అఖిల్ మహాజన్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద, నిమర్జనం సమయంలో డీజేలకు అనుమతి లేదన్నారు. ఇప్పటికే డీజే యజమానాలకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాల నిఘా ఉండాలన్నారు. దీంతో ఏ చిన్న సంఘటన జరిగినా గుర్తించే వీలుంటుందన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వాహకులపై కేసులు నమోదుచేస్తామన్నారు. ప్రతి మండపం వద్ద విధిగా బుక్ పాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు. గణేశ్ మండపాలను తరుచుగా పోలీసులు తనిఖీలు చేస్తారన్నారు. మండపాలను ఇనుప వస్తువులతో ఏర్పాటు చేయకూడదని, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్ధేశించిన సమయానికి మండపాల నిర్వాహకులు విగ్రహాలను నిమజ్జనం తరలించాలన్నారు. గణేశ్ శోభాయాత్రను అర్ధరాత్రి 12గంటల వరకు పూర్తిచేసే బాధ్యతను నిర్వాహకులు తీసుకోవాలన్నారు. గత ఏడాది శాంతి భద్రతలకు విఘాతం కలిగించినవారిపై 10 కేసులు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ రమేశ్, మున్సిపల్ కమీషనర్ మీర్జా ఫసత్ అలీబేగ్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, సిఐలు కృష్ణ, శ్రీనివాస్, మొగిలి ఉన్నారు. వేములవాడ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్ఐలు మారుతి, రమేష్, అశోక్, అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బద్దిపోచమ్మకు బోనాల మొక్కులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 27 : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయానికి భక్తులు మంగళవారం పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్న భక్తులు సోమవారం రాత్రి ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. మంగళవారం తెల్లవారు జామునే మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని ఏర్పాటు చేసి డప్పుచప్పుళ్లతో శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు బద్దిపోచమ్మ ఆలయానికి తరలిరావడంతో గంటల తరబడి క్యూలైన్‌లో నెత్తిన బోనాలతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు అమ్మవారికి బైండ్లవారితో పట్నాలు వేశారు. అమ్మవారికి తీసుకువచ్చిన నైవేద్యాన్ని సమర్పించి ఓడిబియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్‌లో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆలయంలోని పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూలైన్ త్వరతగతిన కదిలేందుకు ఉద్యోగులను అప్రమత్తం చేసి భక్తులకు దర్శనం కల్పించాలని ఉద్యోగులను ఆదేశించారు.



నెత్తిన బోనాలతో క్యూలైన్‌లో భక్తులు



ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని ఆపెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు భక్తులు 56 రకాల పిండి పదార్థాలతో తయారు చేసిన నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు భోజన ప్రసాదం వితరణ చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణతో అలంకరణతో వచ్చిన వారు ఆలయంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరింపిచేశాయి. అనంతరం సోమవారం అర్ధరాత్రి వరకు భక్తులు హరినామ సంకీర్తనలతో భజన కార్యక్రమంలో భక్తి పారవశ్యంతో ఆనందంగా గడిపారు. నాయకులు, ఇస్కాన్ నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దాపూర్ ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ


జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల కోసం వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో గిడ్డంగులు నిర్మించారని దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో నాలుగు దశాబ్దాల క్రితం సుమారు 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగులు నిర్మించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా చేపట్టే పీడీఎస్ బియ్యంతో పాటు, ఫర్టిలైజర్స్, నూనె ఉత్పత్తులు, విత్తనాలు, నిల్వ చేపడుతుండడంతో సుమారు పది మందికి పైగా గోదాముల్లో నిల్వ చేసే ఉత్పత్తులను స్థానిక కార్మికులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ ఉపాధి పొందుతు న్నారన్నారు. గత ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాల నిర్వహణకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంలను కేటాయించడంతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు ప్రైవేట్ గోదాములపై ఆధారపడవల్సి వస్తుందన్నారు. గిడ్డంగుల నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

11 కేవీ విద్యుత్ లైన్ — పనులు అడ్డుకున్న గ్రామస్థులు

శంకరపట్నం, ఆగస్టు 27: మండలంలోని కన్నాపూర్‌లో ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వేయవద్దని విద్యుత్ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. అర్కండ్ల శివారులో రైస్‌మిల్ నిర్మిస్తున్నారు. కన్నాపూర్ సబ్‌స్టేషన్ నుంచి రైస్‌మిల్‌కు విద్యుత్ అందించేందుకు పనులు ప్రారంభించారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామస్థులు పనులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తాడికల్ ఏఈ సంపత్‌రెడ్డి అక్కడకు చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వేరే ప్రాంతం నుంచి వేసుకోవాలని వారు ఏఈకి సూచించారు. గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయని, విద్యుత్ స్తంభాల కోసం గుంత తీస్తే అవి పగిలిపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు ఏఈ సంపత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.


ఏఈతో మాట్లాడుతున్న గ్రామస్థులు



















ఆలయంలో చోరీ

వీర్నపల్లి, ఆగస్టు 27 : వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలోని జగదాంబ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగలగొట్టి డబ్బులను ఎత్తు కెళ్లారు. స్టేషన్ హౌస్ ఇన్ చార్జి బాబు కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం ఆలయం వద్ద హుండీ తాళాలు పగలగొట్టి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకొని హుండీతో పాటు పరిసరాల ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్స్‌లో మద్యం..

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గల శ్రీ లక్ష్మీనర్సింహ వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ తాళం పగుల గొట్టిన దొంగలు లోనికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదు, మరో రూ. 10 వేల మద్యం ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వైన్స్ తెరిచేందుకు నిర్వాహకులు వచ్చి చూడగానే తాళం పగులగొట్టి కౌంటర్ తెరిచి ఉండడంతో ఆందోళన చెందారు. ఈ సంఘటనపై వైన్స్ యజమాని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేత రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వేముల సాయికృష్ణను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 26న మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి అమ్ముతూ సాయికృష్ణ పట్టుబడ్డాడని చెప్పారు. వేములవాడ పట్టణంలోని కొందరు వ్యక్తుల వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణాలతో పాటు పరిసర గ్రామాలకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

కత్తెరతో దాడి కేసులో ముగ్గురికి జరిమానా

జ్యోతినగర్, ఆగస్టు 27: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపల్లి గ్రామంలో చింతపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కత్తెరతో దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులకు జరిమానా విధిస్తూ గోదావరిఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి శ్రీనివాసులు తీర్పునిచ్చారు. 30 అక్టోబరు 2019లో ఖాజీపల్లి గ్రామంలో చింతల లింగయ్య, చింతల కోమురయ్య, చింతల సాయితేజ అనే ముగ్గురు ఒక భూ వివాదంలో శ్రీనివాస్‌పై కత్తెరతో దాడి చేశారు. అప్పటి ఎన్టీపీసీ ఎస్ఐ శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్ఐ సతీష్ సాక్షులను కోర్టులో అడిషనల్ ప్రాసిక్యూటర్ ఆకుల రాములు సమక్షంలో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలు విన్న తరువాత ముగ్గురు నిందితులను దోషులుగా జడ్జి నిర్ధారిస్తూ చింతల లింగయ్యకు ఆరు వేలు, చింతల కోమురయ్య పది వేలు, సాయితేజకు ఆరు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో ఆరునెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

వైపని కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో జక్కని సతీష్(29) అనే వైపని కార్మికుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన జక్కని సతీష్ వైపని కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఒక సోదరి ఉంది. మంగళవారం ఉదయం బయటకు వెళ్లి టిఫిన్ చేసి ఇంటికి వచ్చిన సతీష్ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. నిద్రపోయాడని భావించిన పక్క గదిలో ఉంటున్న అతని సోదరి బీడీలు ఇచ్చేందుకు కంపెనీకి వెళ్లి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలైనా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సోదరి తమ్ముడిని ఎంత పిలిచినా స్పందించకపోవడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నిస్తే ఎంతకు రాకపోవడంతో పైకప్పు పెంకులు ఊడదీసి చూసే సరికి సతీష్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తొలగించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వస్త్రపరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక పోవడం, ఒంటరి జీవితాన్ని భరించలేక మద్యానికి అలవాటుపడి మనస్థాపం చెంది తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోదరి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 27: మండలంలోని మల్యాల గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతం నుంచి ప్రశాంత్ అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్



గాయపడ్డ అనూష్

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పెగడపల్లి, ఆగస్టు 27 : పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో మంగళవారం వీధి కుక్కల దాడిలో పదకొండు చిన్నారి తీవ్రగాయాల పాలు కాగా జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మడిగెల నరేష్, శిరీష దంపతుల కుమారుడు బాబు అనూష్ (11నెలలు) ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. దీంతో బాబు నుదుటి మీద తీవ్ర గాయమైంది. అప్రమత్తమైన బాబు తల్లిదండ్రులు బాబును రక్షించి వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	24,014	4,459	80.5	58.709
ఎల్లంపల్లి	9,886	9,852	20.175	17.785
మిడ్ మానేరు	10,500	14,600	27.54	18.19
ఎల్ఎండీ	14,824	224	24.034	8.37

వివాహిత కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

- ఇద్దరు పరార్
- అరెస్ట్ అయినవారిలో మాజీ నక్సలైట్ దంపతులు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: జిల్లాలోని రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన జక్కుల ధరణి అనే వివాహిత కిడ్నాప్‌నకు పాల్పడిన కేసులో ఆరుగురు కిడ్నాపర్‌లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివాహిత కిడ్నాప్ వివరాలను ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన ధరణిని బోయిన్‌పల్లి మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కమటం కృష్ణవంశీ ప్రేమించుకొని 2022లో పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి ఇష్టం లేనందున ఎలాగైనా తమ కూతురి మనసు మార్చి మరో పెళ్లి చేయాలని భావించిన కుటుంబ సభ్యులు ప్రస్తుతం కామారెడ్డిలో ఉంటున్న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ నక్సలైట్ గొట్టె మనోహర్, అతని భార్య పద్మలను కలిసి చెప్పారు.

ఇందుకు మాజీ నక్సలైట్ మనోహర్ దంపతులు రూ.5 లక్షలు ఇస్తే పరిష్కరిస్తామని ఒప్పందంచేసుకొని ధరణిని కిడ్నాప్ చేయడానికి ఒక ఏడాది నుంచి ప్రణాళిక వేసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రాము, వేములవాడకు చెందిన ఎక్కల దేవి బాలకిషన్, టిల్లు జగదీష్‌ల సహాయంతో పథకం వేసుకొని ఓ కారు అద్దెకు తీసుకొని ఈ నెల 22న బూరుగుపల్లిలోని అత్తగారింటి నుంచి వివాహిత ధరణిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ సమయంలో ఆమె ఆడపడుచు ఆపేందుకు ప్రయత్నం చేసినప్పటికీ వారి కళ్లల్లో పెప్పర్ స్ప్రే కొట్టి ధరణిని కిడ్నాప్‌చేసి కామారెడ్డి నుంచి నిజామాబాద్ జిల్లా లోని చుండూరు గ్రామం నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ వైపు తీసుకెళ్లి ఆమె మనసు మార్చేందుకు ప్రయత్నం చేశారు. ఈ కిడ్నాప్ సంఘటనపై వెంటనే ఆమె భర్త బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కిడ్నాపర్‌లు ధరణిని తిరిగి బూరుగుపల్లిలో విడిచిపెట్టారు. ఈ మేరకు రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన జక్కు లక్ష్మి, జక్కు రాజశేఖర్, చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రమేశ్, కోనరావుపేటకు చెందిన గొట్టె మనోహర్, గొట్టె పద్మ, కోనరావుపేట మండలంలోని మలక్‌పేటకు చెందిన ఎక్కల దేవి బాలకృష్ణలను వేములవాడ, బాలనగర్ ప్రాంతాల్లో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

మిగతా టిల్లు, జగదీష్‌లు పరారీలో ఉన్నారని వీరిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. కోనరావు పేట మండల కేంద్రానికి చెందిన గొట్టె మనోహర్ అనే మాజీ నక్సలైట్ అతని భార్య పద్మలు కామారెడ్డిలో ఉంటూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని చెబుతూ అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని వీరిపై సిరిసిల్ల, కామారెడ్డి, జగిత్యాల జిల్లాలోని పలు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. వీరికి సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, మాజీ నక్సలైట్ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వారి సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జానపద కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 27: ఉమ్మడి జిల్లాలోని 60 సంవత్సరాలు నిండిన జానపద, సంచార జాతుల కళారూపాల కళాకారులు పేర్ల నమోదు, పింఛన్ల కోసం పేర్ల నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ జన, జానపద వృత్తి కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్, కార్యదర్శి ప్రకాశ్, ఉప కార్యదర్శి కనకం రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

డప్పులు, కోలాటం (మహిళలు, పురుషులు) కళాకారులు వారి సంస్థ, వ్యక్తిగత పేరు, సంస్థ కళాకారుని సంఖ్య పంపాలని పేర్కొన్నారు. దుబ్బ, చిందు యక్షగానం, చిరుతల రామాయణం, జడకోలాటం, వీరనాట్యం, కడ్డీ వాయిద్యం, చిరుతల, చెక్క భజనలు, కాటిపాపలు, బ్యాండ్, సన్నాయి మేళా లు, తాటిపాములవారు, సాధనాశూరులు, బుడగ జంగాలు, పాండవుల కథ, వీరభద్రలు, గొల్ల సుద్దులు, గుస్సాడి, కొమ్ము కోయ, ఒగ్గుకథ, బైండ్ల పోతు రాజులు, బోనాలు, బోనాల కోలాటం, పులివేషాలు, చెంచులు, రాజన్న డోలు, తోలు డప్పులు, నగారా, బుడబుక్కలవారు, గంగిరెద్దులు, మొండి బండ, దాసరి, వంశరాజులు, పిచ్చగుంట్లవారు, కిన్నెర, జోగి, బాల సంతులు, బహురూపులు, మంద హెచ్చు, తెరచీరలు, అద్దం పటం, కొర్ర రాజులు, రుంజ, బుర్రవీణ, శారద గాండ్లు, గడజట్టి తదిర కళారూపాలకు చెందిన కళాకారులు పోస్టల్ లేదా కొరియర్ ద్వారా దరఖాస్తులను సెప్టెంబరు 10వ తేదీలోగా జి కృపాదానం, 7/49/2/2/2, రేకుర్తి, కొత్తపల్లి మండలం, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని సూచించారు. మిగతా వివరాలకు 810600 6238 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆవులను తరలిస్తున్న లారీ పట్టివేత

ఊపిరి ఆడక ఆరు మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 27: అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ లారీని తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం గోరెగావ్ నుంచి హైదారాబాద్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు.





ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్య శాఖ సిబ్బంది, లారీలో ఊపిరి ఆడక మృతి చెందిన ఆవులు

ఈ క్రమంలో ఎంహెచ్ 34 బీజీ 8497 నంబర్ లారీని తనిఖీ చేయగా అందులో ఆవులు కనిపించాయి. వాటిని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి లారీని స్వాధీనం చేసుకుని ఆవులను ఎల్ఎండీలోని గోశాలకు తరలించారు. లారీలో 48 ఆవులు ఉండగా ఊపిరి ఆడక ఆరు వాహనంలోనే మృతి చెందాయి. చాలా ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. పోలీసులు పశు వైద్యశాఖ సిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. చనిపోయిన ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇమ్రాన్, సోహైల్, షాహిద్, తుకారాం, లారీ డ్రైవర్ ఫయాజ్‌అలీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్



గోదావరిఖని, ఆగస్టు 27: బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్‌ను దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా నియమించారు. ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్యా ఈ నియామకం చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్‌ను వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా ఎస్ కుమార్ మాట్లాడుతూ 75 లక్షల మంది దళిత సామాజిక వర్గాన్ని సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించడంతో పాటు దళితులకు బీజేపీ దగ్గర కావాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోదీ దళిత సామాజిక వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని, బీజేపీ దేశంలో, సిద్ధాంతం, నిబద్ధతతో పని చేస్తోందని, దళిత యువతీ యువకులను పార్టీలో చేర్పించాలని హైకమాండ్ ఆదేశించినట్లు చెప్పారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఆగస్టు 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం భేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

చెక్‌పోస్టు వద్ద వాహన రుసుము వసూలు

కొండపైకి అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనాలు పోలీస్ చెక్‌పోస్టు నుంచి కొండ పైకి వెళ్లడానికి దేవస్థానం అధికారులు రూ.50 వసూలు చేశారు. దీనిపై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్లు ఇస్తూ వాహనాల రుసుము వసూలు చేయడం ఇదే మొదటి సారి అని ఇలా చేయడం ఏంటనీ ప్రశ్నించారు. దేవస్థానానికి ఆదాయం పెంచుకోవడానికి అనేక మార్గాలు ఉండగా వాటిపై దృష్టి సారించని అధికారులు వాహనాలు వెళ్లడానికి రుసుము వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వాసికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

గంభీరావుపేట ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబరులో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులను అందించే కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లా తిరుమాలయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌లను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. దమ్మన్నపేట పాఠశాలలో పని చేస్తున్న సంపత్‌కుమార్ సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచి కలిగించడమే కాకుండా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఇన్నోవేటర్ల అవార్డులను స్వీకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



జాతీయ సదస్సులో తాడూరి సంపత్‌కుమార్ ఇన్నోవేటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి (ఫైల్)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంపత్‌కుమార్ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా పనిచేస్తూ గ్రామీణ విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నారు. 2022 సంవత్సరంలో దమ్మన్నపేట జడ్పీ పాఠశాలకు సైన్స్ ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. పెద్దపల్లి జిల్లా చందనాపూర్‌తో పాటు దమ్మన్నపేటలో పనిచేస్తున్న క్రమంలోనూ ఇన్నోవేటర్ల అవార్డులను అందుకున్నారు. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులు ఇన్నోవేటర్ల తయారీలో ప్రతిభను కనబర్చారు.

ఇందులో 16 మంది జాతీయ స్థాయిలో, 8 మంది అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు. పోలెండ్, జపాన్, దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నలుగురు విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. 2018 నుంచి 2023 వరకు వరుసగా జాతీయ స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడంతో పాటు తన మార్గనిర్దేశనంలో విద్యార్థులు పలు అవార్డులను అందుకున్నారు. పది మంది విద్యార్థులు ఇంటింటా ఇన్నోవేటర్ల పోటీలో ఐదు అవార్డులను అందుకున్నారు. సంపత్ కుమార్ ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాల్లో 6, 7, 8 తరగతులకు సంబంధించి పాఠ్యాంశాల విభాగంలోనూ ఉన్నారు. టీ శాట్ ద్వారా ఉపాధ్యాయులు, టీచర్లకు డిజిటల్ బోధన అందిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా తాను పదవీ విరమణ పొందే వరకు వంద ఇన్నోవేటర్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంపత్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే 53 ఇన్నోవేటర్లను అందించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ, ఇన్‌స్పైర్ అవార్డులను విద్యార్థులు అందుకునే విధంగా చేయడం ఆనందంగా ఉందన్నారు. బంజారా భాషలోకి సైన్స్ పాఠాలను అనువదించి మాతృభాషలో వారికి పాఠాలను కూడా బోధించినట్లు తెలిపారు.

హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం

పెద్దపల్లి మార్కెట్‌లో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేసి రిటైలర్ల నిరసన

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27 : పెద్దపల్లి మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో హోల్‌సేల్ వ్యాపారుల తీరును నిరసిస్తూ మంగళవారం రిటైల్ వ్యాపారులు ఉచితంగా కూరగాయలను పంపిణీ చేశారు. దీంతో కూరగాయల కోసం ప్రజలు ఎగబడ్డారు. మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు 30 మంది, రిటైల్ వ్యాపారులు 100 మందికి పైగా ఉన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారుల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఉదయం 8 గంటల వరకే విక్రయించాల్సి ఉండగా, పొద్దంతా హోల్‌సేల్ ధరలకే కూరగాయలను విక్రయిస్తుండడంతో రిటైల్ వ్యాపారులు నష్టపోతున్నారు. దీనిని నిరసిస్తూ సోమవారం రిటైల్ వ్యాపారులు కూరగాయల మార్కెట్‌ను బంద్ చేశారు.



పెద్దపల్లి మార్కెట్‌లో కూరగాయల కోసం ఎగబడుతున్న జనం

మంగళవారం కూడా మార్కెట్‌ను బంద్ చేసి సుమారు 30 వేల రూపాయల విలు వైన కూరగాయలను కుప్పలుగా పోసి ఉచితంగా పంపిణీ చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. ఉదయం 8 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టగా రెండు గంటల్లో కూరగాయలన్నీ అయిపోయాయి. వివాదం విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడారు. హోల్‌సేల్ వ్యాపారులు ఉదయం 9:30 గంటల వరకు విక్రయాలు జరుపుకోవాలని, రిటైల్ అమ్మకాలు చేయవద్దని, 5 కిలోలకు తక్కువ గాకుండా మాత్రమే విక్రయించాలని ఒప్పందం కుదర్చడంతో వివాదం సద్దుమణిగింది.

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని ఇంటికి అక్రమంగా విద్యుత్

- కనెక్షన్ తొలగించిన అధికారులు

వేములవాడ, ఆగస్టు 27: భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు, వేములవాడ మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికా రులు గుర్తించారు. కొన్ని సంవత్సరాలుగా చెన్నమ నేని రమేష్ నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి మున్సిపల్, సెస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చెన్నమనేని రమేష్‌బాబు నివాసమైన సంగీత నిలయం (జర్మనీ గెస్ట్‌హౌస్) లోని పలు బల్బులకు మున్సిపల్ స్ట్రీట్ లైట్స్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చి నట్లుగా గుర్తించి తొలగించారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో పలు వురు కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ లైన్ నుంచి అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించామని, అక్రమంగా విద్యుత్ వినియోగించిన బిల్లుకు సంబంధించిన సొమ్మును రికవరీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు పొందిన మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రాజేశ్వరరావు కుమారుడైన చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లు తేలడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



చెన్నమనేని నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

విద్యార్థులను అభినందించిన ఎస్పీ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 27: తెలంగాణ రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలలో ప్రతిభ కనవబరిచిన సిరిసిల్ల కుంగుఫూ అకాడమీ విద్యార్థులను మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో షావోలిన్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలను నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి సిరిసిల్ల కుంగుఫూ కరాటే అకాడమి, స్పార్క్ కుంగుఫూ అకాడమికి చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో పాల్గొన్నారు. సిరిసిల్ల కుంగుఫూ కరాటే అకాడమికి చెందిన విద్యార్థులు జి అక్షిత, జి జస్వంత్, ఏ సిద్ధార్థ, దూస సూష్మ, అలేఖ్య గోల్డ్‌మెడల్స్ సాధించారు. మరో విభాగంలో అలేఖ్య సిల్వర్ మెడల్ సాధించింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలను సాధించిన విద్యార్థులను, మాస్టర్ ఓరగంటి రామకృష్ణ, కోచ్ ఓరగంటి ఉమలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. అదే విధంగా సిరిసిల్ల పట్టణానికి చెందిప స్పార్క్ కుంగుఫూ అకాడమికి చెందిన విద్యార్థులు పలు పతకాలను సాధించారు. గ్రాండ్ మాస్టర్ హమీద్ చేతుల మీదుగా విద్యార్థులు పతకాలను అందుకున్నారు. కోచ్ ఎనగందుల శ్రీనివాస్‌ను అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ. 2లక్షల విరాళం

ఇల్లంతకుంట, ఆగస్టు 27: మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో నిర్మించే పాటిమీది హనుమాన్ ఆలయానికి ఎన్ఆర్ఐ కలువాల శ్రీనివాస్‌రెడ్డి రూ 2 లక్షల 1116 విరాళాన్ని అందించారు. గ్రామంలో మంగళవారం మాజీ సర్పంచు గొడిశెల జితేందర్‌గౌడ్‌కు గాదె మధు ద్వారా చెక్కును అందించారు.

గ్రామగ్రామాన బీజేపీ సభ్యత్వాలను సేకరిస్తాం

ఇల్లంతకుంట, ఆగస్టు 27: గ్రామగ్రామాన బీజేపీ సభ్యత్వాలను సేకరిస్తామని మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సభ్యత్వనమోదు సన్నాహక సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, నాయకులు మామిడి హరీష్, మ్యాకల మల్లేశం, ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, సాయగౌడ్ పాల్గొన్నారు..

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ముస్తాబాద్, ఆగస్టు 27: ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన మహమ్మద్ అంకుష్ వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అదే గ్రామానికి చెందిన మైసమ్మ యూత్ సభ్యులు రూ. 10 వేలు అందించారు.

నేడు ముస్తాబాద్ మండలంలో మంత్రి పొన్నం పర్యటన

ముస్తాబాద్, ఆగస్టు 27: ముస్తాబాద్ మండలంలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పర్యటించనున్నారు. మండలంలోని ప్రైవేట్ కార్యక్రమాలకు మంత్రి హాజరుకానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలంలోని జర్నలిస్టులు మంగళవారం తహసీల్దార్ రామచంద్రంకు వినతిపత్రం అందించారు. దశాబ్ద కాలంగా జర్నలిస్టులుగా కొనసాగుతున్న ఇళ్ల స్థలాల కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. అధికారులు, ప్రభుత్వం, ప్రజలకు కోసం నిరంతరం పని చేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మజీద్, ముత్తయ్య, బాల్‌రెడ్డి, జగదీష్, షరీఫ్, బాబు, రమేశ్, శ్రీనివాస్, మోహీజ్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలోని లబ్ధిదారు బదావత్ వినోద్‌కు మంజూరైన రూ 27 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతినాయక్, దేవేందర్‌నాయక్, బాల్‌సింగ్‌నాయక్, తిరుపతి, కైలాష్, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

● కోనరావుపేట: సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో ఇద్దరికి సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరు కాగా మంగళవారం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాల్లో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నారాయణపూర్‌లో శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను రథంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. మాజీ సర్పంచులు లక్ష్మీ, నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, హన్మండ్లు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నృత్యాలతో మండల కేంద్రంలో యాదవ సంఘం నేతలు భారీ ర్యాలీ తీశారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పూజలు నిర్వహించి ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మీరాల భాస్కర్ యాదవ్, జిల్లా యాదవ సంఘం నాయకులు బండ నర్సయ్య, వీరవేణి మల్లేశం, జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు జేగ్గాని మల్లేశం తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 27: విద్యార్థినిలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో మంగళవారం పోక్సోచట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, సోషల్‌వర్కర్ సంపత్ పాల్గొన్నారు..

మహిళల భద్రతే షీటీమ్స్ లక్ష్యం

చందుర్తి,ఆగస్టు 27: మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని ఏఎస్సై ప్రమీల అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జోగాపూర్ మూడపల్లి గ్రామల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ మోసాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు, మహిళలు సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు వహించాలన్నారు. సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ఇబ్బందుల కు గురి చేస్తే షీటీమ్ నెంబర్ 8712656425 లేదా 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి

వీర్నపల్లి, ఆగస్టు 27 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలని మండల ఇన్‌చార్జి వైద్యాధికారి డా. చిరంజీవి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు రంగంపేట, గర్జనపల్లి గ్రామాలలో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో సీజనల్ వ్యాధులపై మంగళవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీర్నపల్లిలో 41 మందికి, రంగంపేటలో 33 మందికి, గర్జనపల్లిలో 23 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించామని పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

చందుర్తి, ఆగస్టు 27: బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు కొక్కు దేవేందర్ యాదవ్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో మంగళవారం మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వం నమోదు సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షులు పోంచెట్టి రాకేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఒత్తిడిపై అవగాహన

కోనరావుపేట, ఆగస్టు 27 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఒత్తిడిపై మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రవీణ్ మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేదారేశ్వర్, స్థానిక డాక్టర్ వేణుగోపాల్, వైద్య బృందం పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సంఘాల నిరసనలు



కలెక్టర్ వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, నాయకులు



ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

● వేధింపులు ఆపాలని కార్యదర్శుల నిరసన

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 27 : మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉన్నతాధికారుల వేధింపుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు ఇల్లంతకుంటలో ఆత్మహత్యాయత్నానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు జిల్లా అధ్యక్షుడు గోల్లపల్లి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట మండలం కిష్టారావుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు మరో ఉద్యోగం రావడంతో అతన్ని రిలీవ్ చేయకుండా అధికారుల ఇబ్బందులకు గురిచేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై స్పందించిన గ్రామపంచాయతీ కార్యదర్శులు జిల్లా వ్యాప్తంగా విధులు బహిష్కరించి మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో బైఠాయించారు. వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. శ్రీనివాస్ చావుబతుకుల మధ్య అసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని అన్నారు. బాధ్యులైన అధికారులపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకునే నిరసనలు చేపడుతామని కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శుల సంఘం నాయకులు రాజునాయక్ తదితరులుపాల్గొన్నారు.

● భవన నిర్మాణ కార్మికుల ధర్నా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెర్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయలని సీఐటీయూ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లజిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం సీఐటీయూ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి అక్కడి రాగా అయనకు వినతి పత్రాన్ని ఇవ్వకుండా జిల్లా కలెక్టర్‌ను కలుస్తామంటూ తోసుకుంటూ కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించారు. ఏఎస్ఐ శంకర్‌నాయక్‌తోపాటు సిబ్బంది అడ్డుకున్నా వారిని తోసుకుంటూ పరుగులు తీశారు. అదే సమయంలో కార్మిక శాఖ అధికారి నజీర్ అక్కడికి రావడంతో అయనకు సమస్యలు విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. ఈ ధర్నాలో భవన నిర్మాణ కార్మికసంఘం గౌరవ అధ్యక్షుడు కోడం రమణ, జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమౌళి, జిల్లా ఉపాధ్యక్షుడు గీసా బిక్షపతి, సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్, మాల్లారం అరుణ్ కుమార్, గుంటుక నరేందర్, సావనపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

● హమాలీ కార్మికులు..

తెలంగాణ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ సివిల్ సప్లయ్ హమాలీ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌రామయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు అంబేద్కర్ విగ్రహం వద్దనుంచి మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ సివిల్ సప్లయ్ హమాలీ సంఘం అధ్వర్యంలో హమాలీ కార్మికులు ర్యాలీగా జిల్లా కలెక్టరేట్ వరకు వచ్చి కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం హమాలీలకు ఇస్తున్న క్వింటాల్‌కు రూ. 26 నుంచి రూ.40కి పెంచడంతో పాటు ఎక్స్‌గ్రేషియాలను రూ. 6500 నుంచి రూ. 12 వేలకు పెంచాలని, ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేసే హమాలీ కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు వైద్యఖర్చులు కార్పొరేషన్ చెల్లించడంతో పాటు హెల్త్‌కార్డులను ఇవ్వాలన్నారు. కార్మికులకు రూ.5లక్షల ఇన్సూరెన్స్ చేయించాలన్నారు.

జిల్లాలో అక్రమ కట్టడాలను తొలగించాలి

● హైడ్రా లాంటి అథారిటీని ఏర్పాటు చేయాలి ● సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం, మండల కేంద్రాలు, గ్రామాల్లో అనేక చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయని అక్రమ కట్టడాలను ప్రభుత్వం, అధికారులు వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర రాజధానికే హైడ్రాను పరిమితం చేయకుండా జిల్లాలకు విస్తరించాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలపై కబ్జాదారులు నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న మానేరు వాగు, చెరువులు, కుంటలు పూర్తిగా అక్రమ కట్టడాలకు గురైన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాలతో వర్షం వచ్చిన ప్రతిసారి వర్షం నీరు ఎటూపోలేక పట్టణంలోని గృహాలలోకి చేరుతున్నాయని ఈ అక్రమ కట్టడాల వెనక గత పాలకులు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందని ఆరోపించారు. విలీన గ్రామాలతో పాటు పట్టణానికి అనుకొని ఉన్న చెరువుల శిఖాలలో ఎన్నో అక్రమ కట్టడాలు నిర్మించిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో వారి పాత్ర కూడా ఉందన్నారు. కోట్ల రూపాయాల విలువ చేసే భూములు అక్రమార్కులు అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు. ఇరుగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు సీపీఐ పార్టీ పక్షాన ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధిలో ఉన్న భూములను కొందరు కబ్జాదారులు బై నెంబర్లు వేసి అమాయకపు ప్రజలను మోసం చేస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా ఇంచార్జి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని జిల్లాలోని చెరువులు, కుంటలు, మానేరు పరివాహక ప్రాంతాలలో అక్రమ కట్టడాలను తొలగించే విధంగా హైడ్రా లాంటి అథారిటీ కమిటీని జిల్లాలో కూడా ఏర్పాటు చేస్తే ప్రజలు హర్షిస్తారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు సోమ నాగరాజు, అజ్జ వేణు, సత్యం చంద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

నేరాలపై విద్యార్థులకు అవగాహన

తంగళ్లపల్లి, ఆగస్టు 27: విద్యార్థులకు లైంగిక నేరాలపై అవగహన ఉండాలని ఎస్ఐ సుధాకర్ అన్నారు. మంగళవారం పోలీస్‌శాఖ, సఖి కేంద్రం, షీటిమ్‌ల అధ్వర్యంలో తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మహిళ డిగ్రీ కళాశాల, నేరెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థినిలకు లైంగిక వేధింపులు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ సుధాకర్, మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ రోజా మాట్లడుతూ మహిళలపై ఎలాంటి నేరాలు జరిగినాపోలీస్ శాఖ వెంటనే స్పందిస్తుందన్నారు. కార్యక్రమాలలో షీటీం ఏఎస్ఐ ప్రమీల, ప్రిన్సిపాల్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉత్తమ సేవలు అందించాలి'

ఇల్లంతకుంట, ఆగస్టు 27: రైతులకు ఉత్తమ సేవలు అందిస్తే వారు చిరకాలం గుర్తుంచుకుంటారని మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల రైతువేదికలో మంగళవారం బదిలీ అయిన వ్యవసాయ విస్తీర్ణాధికారి అర్చనకు వీడ్కోలు సమావేశంలలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కేతిరెడ్డి అనసూయవెంకటనర్సింహ్మారెడ్డి, మ్యాకల శ్రీనివాస్, గట్ల మల్లారెడ్డి, ముస్కు మల్లయ్య, మాజీ ఎంపీటీసీ ముత్యంరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై తప్పుడు ప్రచారం మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతూన్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి, ఆగస్టు 27: రుణమాఫీపై కావాలనే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు తర్రె మనోహర్, ఓబీసీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గండి నారాయణ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని మంగళవారం కాంగ్రెస్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి రుణమాఫీపై నిరసనలు చేస్తున్నారని అన్నారు. రుద్రంగిలో 600 మందికి రుణమాఫీ కాలేదని బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చెయడం సరైంది కాదని, రుద్రంగిలో సూమారు 54 మందికి రుణమాఫీ కాలేదని కాంగ్రెస్ నాయకులు గుర్తుచేశారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. రుణమాఫీ కాని రైతుల ఇంటి వద్దకు అధికారులు వచ్చి సమాచారం తీసుకుని రుణమాఫీ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సరెడ్డి, కోమిరె శంకర్, చెలుకల తిరుపతి, పల్లి గంగాధర్, తర్రె లింగం, స్వర్గం పరందామ్, గంధం మనోజ్, పోగుల మహేష్, ఎర్రం రాజలింగం, వడ్ల నారాయణ, సూర యాదయ్య, ద్యావల దీలిప్, గుగ్గిళ్ల వెంకటేశం, పడా ల శ్రీనివాస్, ఒద్యారపు రమేష్, దయ్యాల శ్రీనివాస్, గంగారాజం పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



చంద్రంపేటలో సభ్యత్వనమోదు చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

సిరిసిల్ల రూరల్, అగస్టు 27: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో మంగళవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏలను విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు విడతల డీఏ బకాయిలను వెంటనే చెల్లించేందుకు జీవోను విడదల చేసి పదోన్నతుల ద్వారా ప్రాథమిక పాఠశాలలో ఏర్పడిన ఖాళీలను విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, వారికి అన్నిరకాల సెలవులు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన పీఆర్సీ నివేదిక వెంటనే తెప్పించుకుని ఉద్యోగ ఉపాధ్యాయులకు కొత్త వేతనాలను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, మండల అధ్యక్షుడు చర్లపల్లి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి గడ్డం శంకర్, జిల్లా అసోషియేషన్ అధ్యక్షుడు జక్కని నవీన్, కార్యదర్శి గుర్రం దేవదాసు, రాష్ట్ర భాధ్యులు కామినేని నీలి శ్రీనివాస్, కూతూరి కరుణాకర్‌రెడ్డి, పోలుక అనంద్, సత్యనారాయణ, నందాల శంకర్ ఉన్నారు.

జడ్పీ సీఈవోను కలిసిన ఉపాధ్యాయులు

జిల్లా పరిషత్ సీఈవో నూతనంగా విధుల్లో చేరిన వినోద్‌కుమార్‌ను మంగళవారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు మార్యద పూర్వకంగా కలిసి సన్మానించారు. పూల మొక్కలను అందజేశారు.

మంత్రి పర్యటనలో నిరసనలు చేపడతాం

చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 27: పవర్‌లూం పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తామని గతంలో హామీ ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ హామీలను అమలు చేయకపోతే మంత్రి సిరిసిల్ల పర్యటనలో నిరసనలు చేపడతామని చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో రవి మాట్లాడారు. ఎనిమిది మాసాలుగా సిరిసిల్ల పవర్‌లూం పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. మూడు మాసాల క్రితం జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టగా మంత్రి పొన్నం ప్రభాకర్ జేఏసీతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో జేఏసీ ఆందోళనలను విరమించిందన్నారు. సమస్యలు పరిష్కరించక పోవడంతో తిరిగి జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలతో ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఆందోళనలు చేపట్టాక ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సమక్షంలో చర్చలు జరగాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల బకాయిలు కూడా ఇవ్వలేదని ఉత్పత్తి చేసిన గుడ్డకు మార్కెట్‌లో డిమాండ్ లేక ప్రభుత్వం కొత్తగా ఆర్డర్లు ఇవ్వకపోవడంతో పవర్‌లూం పరిశ్రమలో ఉపాధి లేక కార్మికుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పవర్‌లూం పరిశ్రమ యధావిధిగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా సమానత్వ దినోత్సవం

గంభీరావుపేట, ఆగస్టు 27: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సమానత్వ దినోత్సవం నిర్వహించారు. ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ వి.వాణి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి విజయలక్ష్మీ అధ్యక్షతన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి మహిళలు రాజకీయ, ఆర్థికసామాజిక సాంకేతిక, అంతరిక్ష రంగాలలో దూసుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్, ఎన్ఎస్ఎసిపీఓ పాక ధర్మపురి, కోఆర్డినేటర్ డాక్టర్ వై ఆంజనేయులు, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్, డాక్టర్ ఆది విష్ణు, మనోహర్, శ్రీనివాస్, మహేష్ కృష్ణ ప్రసాద్ తదితర అధ్యాపక అధ్యాపకేతుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఫ్ చెక్కులతో ఆర్థికంగా భరోసా

వేములవాడ టౌన్, ఆగస్టు 27: రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులతో బాధితులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య అన్నారు. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన 8 మంది బాదితలకు సీఎంఆర్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనుకయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఎవరికి ఎలాంటి సమస్యలు తలెత్తినా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి రవీందర్, ఎర్రం రాజు, ఎర్రం ఆగయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎర్రం సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కవితకు బెయిల్ మంజూరుపై బీఆర్ఎస్ సంబరాలు

వేములవాడ, ఆగస్టు 27 : ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు మంగళవారం వేములవాడలో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, సిరిగిరి రామచందర్, గోలి మహేశ్, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, ముద్రకోల వెంకటేశం, సలీం, అంజద్ పాషా, మైలారం రాము, వాసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్ : భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ మంజూరు కావడంతో జాగృతి నాయకులు మంగళవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. సిరిసిల్ల, కామారెడ్డి జాగృతి నాయకులు మంగళవారం రాజన్న ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. జాగృతి

● తంగళ్లపల్లి : బీఆర్ఎస్ ఎంఎల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకురాళ్లు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం తంగళ్లపల్లిలో మాజీ ఎంపీపీ పడిగెల మానస అధ్వర్యంలో ఎంఎల్సీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాళ్లు పుసపెల్లి సరస్వతి, కోడం సంధ్యరాణి, వనం లావణ్య, లలిత, పద్మ, సువర్ణ, చందనపాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: ఎవరు ఎన్ని కుట్రలు చేసినా న్యాయమే గెలిచిందని బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మాజీ ఉపసర్పంచు బుర్ర బాలకిషన్, ప్రధాన కార్యదర్శి రడం ప్రవీణ్, కేటీఆర్ యువసేన ఇంచార్జ్ ఒరుపుల రాములు యాదవ్, నాయకులు మహేష్, సమీర్, తిరుపతి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంతిమ సంస్కారాలు

గంభీరావుపేట, ఆగస్టు 27: ఏ దిక్కులేని వారికి ఆ దేవుడే దిక్కని నమ్మి గంభీరావుపేట వృద్ధాశ్రమంలో గత కొన్ని ఏళ్లుగా ఉంటున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన రత్నమ్మ (90) అనే వృద్ధురాలు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. అనాథాశ్రమ నిర్వాహకులు మల్లుగారి నరసయ్యగౌడ్ అన్నీ తానై స్వయంగా అంతిమ సంస్కారం నిర్వహించారు. మా అనాథ అభాగ్యుల ఆశ్రమాన్ని గంభీరావుపేటలో మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సయ్యగౌడ్ 18 సంవత్సరాల నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం లేకుండా, విరాళాలు సేకరించకుండా ఆత్మీయుల సహకారంతో కొనసాగిస్తున్నాడు. మేకర్తి శ్రీనివాస్, కిషన్‌రావు, గ్రామ హెల్పింగ్ హాండ్స్ నాగరాజ్, నరేష్, మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, జోగయ్యగారి హరీష్, చేపూరి సంతోష్ చారి, బొంగు మల్లేశం యాదవ్ పాల్గొన్నారు.